క్లుప్తంగా

89 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

నరసన్నపేట: స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దీంట్లో 89 మంది విశ్రాంత ఉద్యోగులకు వైద్య తనిఖీలు చేపట్టారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు పైల రమేష్, జనరల్ సర్జన్ రమణతో పాటు సాగర్‌లు వైద్య తనిఖీలు చేశారు. కిమ్స్ పీఆర్‌ఓ రమేష్‌తో పాటు విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎస్.ప్రభాకరరావు పాల్గొన్నారు.

సక్రమంగా రికార్డుల నిర్వహణ



రికార్డులు పరిశీలిస్తున్న ఏపీఎం కూర్మారావు

ఆమదాలవలస రూరల్: మహిళా సంఘాలకు చెందిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఏపీఎం పి.కూర్మారావు అన్నారు. మండల మహిళా సమాఖ్యలో శుక్రవారం క్లస్టర్ కోఆర్డినేటర్ల పుస్తక నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ సంఘం సభ్యులు పొదుపు, తీసుకున్న అప్పులు, చెల్లిస్తున్న వడ్డీలు, సభ్యులకు ఇచ్చిన అప్పులు, వసూలైన వడ్డీలన్నింటికీ సక్రమంగా పుస్తకాలలో నమోదు చేయాలని అన్నారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు తమ్మినేని ధనలక్ష్మి, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

వేతనదారులకు అభినందన



వేతనదారులను అభినందిస్తున్న ఎంఈవోలు

సారవకోట: మండలంలోని అర్లి గ్రామానికి చెందిన ఉపాధి వేతనదారులు, ఫీల్డ్ అసిస్టెంట్ జగదీశ్వరరావును ఎంఈవోలు ఎంవీ రమణ, భూలక్ష్మిలు శుక్రవారం అభినందించారు. జాతీయ రహదారి 326ఏ నుంచి అర్లి గ్రామానికి వెళ్లే రహదారికి ఇరువైపులా మొక్కలు బాగా పెంచడంతో వారిని అభినందించారు.

భక్తిశ్రద్ధలతో మల్లికార్జున స్వామి కల్యాణం



కల్యాణ మహోత్సవం జరిపిస్తున్న పండితులు భాస్కరశర్మ

ఆమదాలవలస రూరల్: అక్కులపేట గ్రామంలోని సుందర మల్లికార్జునస్వామి కల్యాణాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితులు బంకుపల్లి భాస్కరశర్మ ఆధ్వర్యంలో ముందుగా గణపతి పూజా, అధంగపూజ, హోమాలు జరిపించి, శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు కల్యాణం జరిపారు. అనంతరం గ్రామ పురవీధుల్లో తిరువీధి కార్యక్రమాన్ని నిర్వహించగా.. భక్తులు పాల్గొన్నారు.

6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పోలాకి: ఏపీ మోడల్‌స్కూల్‌లో ఆరో తరగతిలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఈదులవలస మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ పి.ప్రవీణ తెలిపారు. ఈ నెల మూడో తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నను. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ. 75, ఓసీ, బీసీ అభ్యర్థులు 150 రూపాయలు ఫీజుతో మార్చి 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 21న పాఠశాల ఆవరణలో ప్రవేశపరీక్ష ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 80082 82009, 96527 30073 నంబర్లను సంప్రదించాలని కోరారు.

బూర్జ: ఓ.వి.పేట ఏపీ మోడల్ స్కూల్‌లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతిలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ బి. శ్రీనివాసరావు తెలిపారు. వివరాల కోసం 95503 31946, 77994 93969 నంబర్లను పాఠశాల పని వేళల్లో సంప్రదించాలన్నారు.

నేడు స్పీకర్ తమ్మినేని బూర్జలో పర్యటన

బూర్జ: స్పీకర్ తమ్మినేని సీతారాం శనివారం బూర్జ మండలంలో పర్యటించనున్నారు. ఈ మేరకు ఆమదాలవలసలోని స్పీకర్ క్యాంప్ కార్యాలయం నుంచి శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఉదయం పది గంటలకు అల్లెన గ్రామంలో జగనన్న కాలనీలో ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్పీకర్ పాల్గొంటారు. 11 గంటలకు బూర్జ గ్రామంలో రైతు భరోసా కేంద్రం ప్రారంభోత్సవం, 11.30 గంటలకు పెద్దలంకాం గ్రామంలో జగనన్న కాలనీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు.

పార్టీ విజయానికి కష్టపడాలి



మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర జిల్లాల డిప్యూటీ రిజనల్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్
- ఉత్తరాంధ్ర జిల్లాల డిప్యూటీ రిజనల్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు
- నియోజకవర్గస్థాయి బూత్ కమిటీ సమావేశం



సమావేశానికి హాజరైన బూత్ కమిటీ సభ్యులు

పాతపట్నం: పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు కష్టపడి పనిచేసి అనునిత్యం ప్రజల మధ్య ఉంటూ నిస్వార్థంగా ఉండే వ్యక్తులను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం వదులుకోదని పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. వారికి సముచిత స్థానాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పిస్తున్నారన్నారు. పాతపట్నం బ్రాహ్మణవీధి కూడలిలోని కేఎస్ఎం ప్లాజాలో స్థానిక ఎమ్మెల్యే రెడ్డి శాంతి అధ్యక్షతన నియోజకవర్గస్థాయి బూత్ కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పారదర్శకంగా లబ్ధిదారునికి చేరుతున్నాయని, ఆ విషయాన్ని ప్రజల్లో తీసుకొని వెళ్లాలన్నారు. సీఎం జగన్ ప్రతి ఇంటికి చేసిన మంచిని వివరించి, పార్టీని గెలిపించేందుకు తోడ్పడాలన్నారు. బూత్ లెవల్‌లో జాగ్రత్తగా ఉండాలన్నారు. అనునిత్యం పార్టీ కోసం పనిచేయాలన్నారు. పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు (చిన్నశ్రీను) మాట్లాడుతూ.. ప్రభుత్వం చేసే మంచి ప్రజలకు తెలియజేయాలన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా, అభివృద్ధి పని జరగాలన్నా మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులు, నేతల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. గ్రామాల్లో ఏ పని కావాలన్నా ప్రజలు ఇంటికి వద్దకే అందిస్తుమన్నారు. పార్టీ కోసం గ్రామస్థాయిలో కష్టపడి పనిచేయాలన్నారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, పార్టీ శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి పెడాడ తిలక్, నియోజకవర్గ పరిశీలకుడు కమిరి రాజేశ్వరరావులు మాట్లాడుతూ.. బూత్ కమిటీలు తీసుకోవల్సిన జాగ్రత్తలు, పార్టీ విజయం కోసం ఎలా పనిచేయాలో వివరించారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకుడు పాలవలస రాజశేఖరం, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎం.శ్యామ్ సుందరరావు, బాలరాజు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, పాతపట్నం, మెళియాపుట్టి, కొత్తూరు, హిరమండలం, ఎల్.ఎన్.పేట మండలాలకు చెందిన 322 పోలింగ్ బూత్‌లకు చెందిన సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి



బూర్జ: మాట్లాడుతున్న డాక్టర్ రాజశేఖర్



జలుమూరు: మాట్లాడుతున్న మెడికల్ అధికారి శ్రీకాంత్

బూర్జ: ఈ నెల మూడో తేదీన నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బూర్జ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జి.రాజశేఖర్ కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందికి ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. ఐదేళ్లలోపు పిల్లలకు రెండు పోలియో చుక్కలు వేయాలని సూచించారు. తొలిరోజున పోలియో కేంద్రాల వద్ద, నాలుగు, ఐదు తేదీల్లో ఇంటింటికీ వెళ్లి మాపింగ్ చేయనున్నట్లు వివరించారు. మండలంలో 12 బూత్‌లు, రెండు సూపర్‌వైజర్, ఒక మొబైల్ టీమ్‌ను నియమించామన్నారు. సమావేశంలో సీహెచ్‌వో కె.అప్పలస్వామి, హెల్త్ సూపర్‌వైజర్లు లఖినాన సరోజిని, తేజారావు, హెల్త్ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

జలుమూరు: ఈ నెల మూడో తేదీన నిర్వహించనున్న పల్స్ పోలియోను విజయవంతం చేయాలని జలుమూరు మెడికల్ అధికారి తాడేల శ్రీకాంత్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో సిబ్బందితో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, బస్‌స్టాప్‌లు, రైల్వేస్టేషన్‌లు, మురికివాడలు సైతం మొబైల్ వాహనాల ద్వారా అప్పుడే పుట్టిన పిల్లల నుంచి ఐదు సంవత్సరాలు వయస్సు ఉన్నవారికి చుక్కల మందు వేయాలన్నారు. సమావేశంలో పర్యవేక్షకులు చిన్న రాజులు ఉన్నారు.

16వ తేదీకి లోక్ అదాలత్ వాయిదా

పాతపట్నం: ఈ నెల తొమ్మిదో తేదీన జరగాల్సిన జాతీయ లోక్ అదాలత్ 16వ తేదీకి వాయిదా పడినట్టు పాతపట్నం కోర్టు (ఎఫ్ఏసీ) జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ హరిప్రియ తెలిపారు. శుక్రవారం కోర్టు ఆవరణలో న్యాయవాదులతో లోక్ అదాలత్‌పై సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌ను కక్షిదారులందరూ ఉపయోగించుకోవాలని కోరారు. న్యాయవాదులు లోక్ అదాలత్‌కు సహకరించాలన్నారు. ఎక్కువ కేసులు అదాలత్‌లో రాజీపడేలా చూడాలన్నారు. న్యాయవాదులు ఫాల్గుణ రావు, ప్రసాద్, సత్యనారాయణ, రామారావు ఉన్నారు.



మాట్లాడుతున్న జడ్జి హరిప్రియ

ఇంటర్ పరీక్షలు ఆరంభం



నరసన్నపేట: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు



కొత్తూరు: శ్రీవెంకటసాయి జూనియర్ కాలేజీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ వేణుగోపాలరావు

నరసన్నపేట: ఇంటర్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు ప్రథమ సంవత్సరం విద్యార్థులు పరీక్షను రాశారు. నరసన్నపేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు తామరాపల్లి బాలికల రెసిడెన్సియల్ కాలేజీ, సంపత్ సాయి, పద్మావతి, ఎంఎల్‌ఆర్, జ్ఞానజ్యోతి జూనియర్ కళాశాలల్లో కేంద్రాలను కేటాయించారు.

బూర్జ: బూర్జలో 272 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్టు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం విద్యాలయం ప్రిన్సిపాల్ నూక రామకృష్ణ తెలిపారు. బూర్జ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఓవీ పేట ఏపీ మోడల్ విద్యాలయం, కొల్లివలస కేజీబీవీ, కొల్లివలస డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం విద్యాలయాల విద్యార్థుల రెండు కేంద్రాలను కేటాయించారు. వీటిలో బూర్జ ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో 161 మంది, కొల్లివలస డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో 111 మంది పరీక్షలకు హాజరయ్యారు. బూర్జ జీజేసీకు కింతలి జీజేసీ కళాశాల లెక్చరర్ ఐ.జయరామ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం విద్యాలయానికి కొత్తూరు జీజేసీ లెక్చరర్ ఎస్.మహేశ్వరరావు డిపార్టమెంటల్ అధికారిగాను వ్యవహరించారు.

కొత్తూరు: కొత్తూరులో ప్రశాంతంగా పరీక్షలు ప్రారంభమయ్యాయి. స్థానిక సీఐ ఆర్.వేణుగోపాలరావు, ఎస్సై ఎంఏ అహమ్మద్‌లు కేంద్రాలను పర్యవేక్షించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ కేంద్రంలో 261 మందికి 240 మంది హాజరవ్వగా.. 27 మంది గైర్హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ రవికుమార్ తెలిపారు. అలాగే శ్రీవెంకటసాయి జూనియర్ కాలేజీ కేంద్రంలో 99 మందికి 92 మంది హాజరవ్వగా.. ఏడుగురు గైర్హాజరయ్యారు.

సారవకోట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కేంద్రం కేటాయించడంతో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో పాటు కేజీబీవీ విద్యార్థులకు 79 మంది పరీక్షకు హాజరయ్యారు.

పోలాకి: పోలాకి, ప్రియాగ్రహారం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల వద్ద తొలిరోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పోలాకిలో ఇద్దరు, ప్రియాగ్రహారంలో ఎనిమిది మంది విద్యార్థులు గైర్హాజరవ్వగా.. 323 మంది పరీక్షలకు హాజరైనట్టు ఆయా కేంద్రాల ఇన్‌చార్జిలు తెలిపారు.

ఆమదాలవలస: ఆమదాలవలస పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, టి.ఎస్.ఆర్.జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో 427 మంది పరీక్షకు హాజరవ్వాల్సి ఉండగా 13 మంది గైర్హాజరయ్యారు.

పాతపట్నం:పాతపట్నం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల (బ్రిడ్జి స్కూల్)లతో పాటు కిర్మణ్మయి, మహేంద్ర కళాశాల కేంద్రాల్లో పరీక్షలు ప్రారంభమయ్యాయి. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. పరీక్షా సమయంలో బయట వ్యక్తులు ఎవరు రాకూడదని సీఐ సాయి తెలిపారు. పరీక్షల సమయంలో జిరాక్సు సెంటర్లు మూసివేయాలన్నారు. మూడు కేంద్రాల్లో 740 మంది హాజరుకాగా 12 మంది గైర్హాజరయ్యారు.

జలుమూరు: జలుమూరు మండల కేంద్రం జూనియర్ కాలేజీ కేంద్రంలో 285 మంది పరీక్ష రాయాల్సి ఉండగా ఐదుగురు గైర్హాజరైనట్టు చీఫ్ సూపరింటెండెంట్ దొంపాక వేణుగోపాలరావు తెలిపారు.

హిరమండలం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ కేంద్రంలో 222 మందికి 194 మంది పరీక్ష రాశారు. 28 మంది గైర్హాజరయ్యారు. వీరిలో తెలుగుకు సంబంధించి 144 మంది పరీక్ష రాయాల్సి ఉండగా.. 14 మంది గైర్హాజరయ్యారు. వొకేషనల్‌కు సంబంధించి 76 మందికి 14 మంది గైర్హాజరైనట్టు అధికారులు తెలిపారు. చీఫ్ సూపరింటెండెంట్ సూర్యకుమారి, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.



సారవకోట: పరీక్ష రాస్తున్న విద్యార్థులు



ఆమదాలవలస: ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో పరీక్ష రాసేందుకు వెళ్తున్న విద్యార్థులు

వీఆర్‌ఓ ఆత్మహత్యాయత్నం

ఆమదాలవలస: ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధి లక్ష్మినగర్ సచివాలయంలో వీఆర్‌ఓగా పనిచేస్తున్న బగాది కృష్ణకిశోర్ శుక్రవారం ఎలుకల మందు తాగి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించాడు. ఆమదాలవలస పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కృష్ణకిషోర్ పట్టణంలోని కృష్ణాపురం జంక్షన్ వద్ద అపస్మారక స్థితిలో ఉండగా స్థానికులు గమనించి ఆటోలో మండలంలోని జొన్నవలస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడకు వెళ్లాక బాధితుడు ఎలుకల మందు తాగినట్లు గమనించి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. తనకు ఆరోగ్య సమస్యలు ఉన్నాయని, ఇంట్లో పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేస్తున్నారని కృష్ణకిశోర్ పోలీసులకు తెలిపాడు. అయితే బాధితుడి తండ్రి బగాది తేజేశ్వరరావు మాత్రం అధికారుల ఒత్తిడి కారణంగా తన కుమారుడు ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించాడని ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం అతని ఆరోగ్య నిలకడగా ఉందని పోలీసులు తెలిపారు.

ఘనంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం



పూజలందుకుంటున్న స్వామివారు

పొందూరు: స్థానిక అయ్యప్పస్వామి ఆలయ తొమ్మిదో వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో రెండు రోజుల పాటు పూజలు జరిపారు. ఆలయంలో ఉన్న పంచముఖస్వామికి అభిషేక పూజలు చేశారు. అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహానికి తిరువీధి మహోత్సవం చేపట్టారు. ఈ సందర్భంగా చిన్నారుల కోలాటం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఆరవిల్లి గిరిశర్మ, కూనపులి కిరణ్‌శర్మ, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తెలుగు సాహితీ సదస్సుకు భమిడిపాటి

నరసన్నపేట: అమెరికాకు చెందిన వంగూరి ఫౌండేషన్ 30వ వార్షికోత్సవం సందర్భంగా కాకినాడలో జరుగుతున్న అఖిల భారత తెలుగు సాహితీ సదస్సుకు రచయిత భమిడిపాటి గౌరీశంకర్ పాల్గొనున్నారు. ఈ నెల 9, 10 తేదీల్లో సదస్సు జరగనుంది.

ఈమేరకు ఆహ్వాన పత్రిక వచ్చిందని గౌరీశంకర్ స్థానిక విలేకరులకు శుక్రవారం తెలిపారు. నరసన్నపేట రచయితల వేదిక కార్యదర్శిగా, గాయిత్రి కళాశాల తెలుగు విభాగాధిపతిగా గౌరీశంకర్ పనిచేస్తున్నారు. సదస్సుకు ఆయన రచించిన 'ప్రాచీన సాహిత్యంలో శిల్పం' ఎన్నికైంది. గౌరీశంకర్‌కు స్థానిక రచయితల వేదిక అధ్యక్షుడు సదాశివుని కృష్ణ తదితరులు అభినందించారు.

శ్రీముఖలింగంలో బారికేడ్ల ఏర్పాట్లు



శ్రీముఖలింగంలో ఏర్పాటు చేస్తున్న బారికేడ్లు

జలుమూరు: శ్రీముఖలింగంలో శివరాత్రి ఉత్సవాలకు బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నామని ఆలయ అధికారులు శుక్రవారం తెలిపారు. ఆలయానికి సంబంధించినవి 175 బారికేడ్లు ఉండగా మిగిలినవి ఇతర ఆలయాల నుంచి తెప్పిస్తున్నారు. సామాన్యులకు కూడా స్వామి దర్శనం సంతృప్తికరంగా జరిగేలా పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటున్నారు. అదనంగా సీసీ కెమెరాలను కూడా తీసుకువస్తున్నారు.

సీఎం జగన్ పాలన దేశానికే ఆదర్శం



షళంత్రిలో ఆర్బీకేను ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- అభివృద్ధి పనుల ప్రారంభంలో స్పీకర్ తమ్మినేని



నందికొండ కాలనీలో లబ్ధిదారులకుహౌసింగ్ రిజిస్టర్ పట్టాలు అందిస్తున్న సీతారాం

సరుబుజ్జిలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. నందికొండ, ఇస్కలపాలెం గ్రామాల్లో లబ్ధిదారులు నిర్మించుకున్న జగనన్న కాలనీ ఇళ్లను శుక్రవారం ప్రారంభించారు. అలాగే కొండవలసలో రూ. 40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, షళంత్రిలో రూ.17 లక్షల 50 వేలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రభుత్వం అందజేస్తున్న సుపరిపాలన, సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో ప్రజలకు అందుతున్న సేవల వైపు దేశం మొత్తం చూస్తూ వాటి అమలుకు అధ్యయన కమిటీలు వేయడం గొప్ప విషయమని అన్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సచివాలయాలతో సాధ్యమవుతుందని వెల్లడించారు. విజ్ఞాన ప్రపంచంలో ఆంధ్రప్రదేశ్‌లో చదువుకున్న ప్రతీ విద్యార్థి విశ్వవిఖ్యాతస్థాయిలో ఉండాలన్న తపనతో సీఎం జగన్ విద్యారంగానికి అగ్రపీఠం వేస్తున్నారని చెప్పారు. వైద్యం కోసం కిలోమీటర్ల దూరం వెళ్లకుండా గ్రామస్థాయిలో విలేజ్‌హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. పేదరికం అనేది విద్య, వైద్యం, సేద్యానికి అడ్డు కాకూడదనే ఆలోచనతో అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం జగన్‌కు ప్రజలంతా సహకరించాలని కోరారు. రైతులకు ఉచితబీమా, రైతుభరోసా, వడ్డీ రాయితీ అందించి ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. యంత్ర సేవాపథకం ద్వారా కస్టమర్ హైరింగ్ సెంటర్ల ఆధ్వర్యంలో రైతు గ్రూపులకు రాయితీపై ట్రాక్టర్లు అందించి రైతుల ఆర్థికంగా అభివృద్ధికి బాటలు వేస్తున్నారని వెల్లడించారు.

ఇంటిస్థలంపై పూర్తిహక్కులు..

ఇంటిపట్టాలనే భవిష్యత్ అవసరాలకు వినియోగించుకునే విధంగా లబ్ధిదారులకు పూర్తిహక్కులు కలిప్పించే దిశగా వారిపేరుమీదుగా పట్టాలు రిజిస్ట్రేషన్లు చేసినట్లు స్పీకర్ సీతారాం తెలిపారు. నందికొండ, సరుబుజ్జిలి ప్రాంతాల్లో సుమారు 57 మందికి రిజిస్ట్రేషన్ చేసిన ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, వైస్ ఎంపీపీలు జి.వి.శివానందమూర్తి, లావేటి అనిల్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు, కొత్తకోట పీఏసీఎస్ చైర్మన్ కావిలాపు చంద్రశేఖర్, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎడ్ల ఈశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ అత్తులూరి రవికాంత్, సరుబుజ్జిలి, కొండవలస, షళంత్రి సర్పంచ్‌లు బొడ్డేపల్లి చాందిని, బత్తిని వరలక్ష్మి, ఎల్.విశ్వేశ్వరరావు, ఎంఎంఎస్ అధ్యక్షురాలు బొడ్డేపల్లి చామంతి, హౌసింగ్ ఏఈ లక్ష్మీనారాయణ, పీఆర్‌జేఈ మణికుమార్ పాల్గొన్నారు.

భవిత కేంద్రాలు పనితీరు భేష్

- రాష్ట్ర సహిత విద్యా కోఆర్డినేటర్ అమ్మినాయుడు



రికార్డులు పరిశీలిస్తున్న అమ్మినాయుడు

జలుమూరు: ప్రత్యేక అవసరాల పిల్లల కోసం ఏర్పాటు చేసిన భవిత కేంద్రాల పనితీరు బాగుందని.. వీటి ద్వారా ఆయా పిల్లల్లో మంచి మార్పులు వస్తున్నాయని రాష్ట్ర సహిత విద్యా కోఆర్డినేటర్ అమ్మినాయుడు అన్నారు. జలుమూరు మండల కేంద్రంలో ఉన్న భవిత కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో జగనన్న గోరుముద్దలో భాగంగా మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. మంచి వాతావరణంలో భవిత కేంద్రాల నిర్వహణ ఉంటే మంచి ఫలితాలు వస్తాయని సూచించారు. తొలుత భవిత కేంద్రం రికార్డులు పరిశీలించారు. ఈయనతోపాటు జిల్లా కోఆర్డినేటర్ బి.గోవిందరావు, మండల విద్యాశాఖ అధికారులు బి.మాధవరావు, ఆర్.ఎస్.ప్రసాదరావు హెచ్‌ఎం మెండ రామారావు, ఉపాధ్యాయులు బి.సతీష్‌కుమార్, పి.రమేష్, పి.కృష్ణప్రసాద్ ఉన్నారు.

జోరుగా పింఛన్ల పంపిణీ



బూర్జ: సూరయ్యకు పింఛన్ అందజేస్తున్న గ్రామ వలంటీర్ యరగాడ లక్ష్మి



ఆమదాలవలస: కృష్ణాపురంలో రాజారావుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ పొన్నాడ శకుంతల



ఆమదాలవలస: చింతాడలో తవుడు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ భాగ్యలక్ష్మి

బూర్జ: సామాజిక పింఛన్ల పంపిణీ ప్రక్రియ శుక్రవారం జోరుగా సాగింది. వలంటీర్లు తెల్లవారుజాము నుంచే లబ్ధిదారుల ఇళ్లకు, ఆస్పత్రులకు వెళ్లి పింఛన్లను అందజేశారు. బూర్జ మండలం ఏపీపేట పంచాయతీ కేకే రాజపురం గ్రామానికి చెందిన యరగాడ సూరయ్య అనారోగ్యంతో శ్రీకాకుళం రిమ్స్‌లో వైద్యం పొందుతున్నాడు. దీంతో గ్రామ వలంటీర్ యరగాడ లక్ష్మి ఆస్పత్రికి వెళ్లి వృద్ధాప్య పింఛన్ రూ. మూడు వేలు అందజేసి ఆదర్శంగా నిలించారు.

సరుబుజ్జిలి: వీరమల్లిపేట గ్రామానికి చెందిన జనపాలం వెంకన్న అనారోగ్యంతో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నాడు. గ్రామ వలంటీర్ గురజా రామరాజు ఆస్పత్రికి వెళ్లి వృధాప్య పింఛన్ మొత్తాన్ని వెంకన్నకు అందించారు. ఫొటో:01ఎఎమ్‌వి82: సరుబుజ్జిలి: వెంకన్నకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రామరాజు

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధి రెండో వార్డు కృష్ణాపురం గ్రామానికి చెందిన వృద్ధుడు మెట్ట రాజారావు వలంటీర్ పొన్నాడ శకుంతల వెళ్లే సమయానికి తన ఇంటివద్ద లేరు. బయటకు వెళ్లినట్టు కుటుంబ సభ్యులు చెప్పగా ఆయన్ని వెతుకుంటూ రహదారిపై కూర్చొని ఉన్న రాజారావుకు వలంటీర్ శకుంతల పింఛన్ మొత్తాన్ని అందజేసి ఆదర్శంగా నిలిచారు. అలాగే మున్సిపాలిటీ పరిధి ఏడువార్డు చింతాడ గ్రామంలోని గుండ తవుడు తన ఇంటివద్ద కాకుండా వేరొక చోట ఉంటే అక్కడికి వెళ్లి ఆ వార్డు వలంటీర్ బలగ భాగ్యలక్ష్మి పింఛన్‌ను అందజేశారు.